# యోగం!

హెడ్డు వెంకటపతి తన బల్లమీదున్న కవరు తీసి అడ్రసు చదువుకున్నాడు. తన పేరుతో స్టేషన్ అడ్రస్‌కిరాసే బంధువులెవరులేరే! అలాంటిది ఇంటి పేరుతో సహా పొల్లుపోకుండా రాసివుండడం ఆశ్చర్యం కలిగించింది. కవరు చించి ఉత్తరం బయటికి తీశాడు. చిన్న కాగితం మీద ఆరే పంక్తులున్నాయి, గబగబా చదువుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. దగ్గర్లో కానిస్టేబుళ్లెవరూలేరు. ఉత్తరం ముక్క కవర్లో పెట్టి ఎవరూ గమనించకముందే జేబులో లోపలగా దూర్చాడు.

ఎదురుగా ట్రేలోవున్న కలం, పక్కనే ఉన్న ఫారాలు, ఫైళ్ళు, తెల్ల కాగితాలు హెడ్డు తమ నింకా పలకరించలేదేమా అని ఆశ్చర్య పోయాయి. హెడ్డు ఎందుకో పరధ్యానంగావున్న సంగతి పసిగట్టి

నట్టున్నాయి. కారణం అంతుపట్టి వుండదు. ఫ్యాను గాలికి ఫైళ్ళలో ఒదిగివున్న పత్రాలు ఆలోచనలతో నెమ్మదిగా తలలూపుతున్నట్లు కనిపించాయి.

వెంకటపతి తరహాయే వేరు. కిందనుంచి ఎదిగి వచ్చినవాడు. కష్టించి పనిచేయనిదే మనసు వొప్పుకోని తత్వం. తనకూ, తన కుటుంబానికీ అన్నం పెడుతున్న పోలీసు శాఖంటే పంచ ప్రాణాలు.

పోలీసు వ్యవస్థ గురించి అతనికి తెలియని సంగతి అంటూలేదు. డ్యూటీ అంటే డ్యూటీయే. డ్యూటీ రోస్టరు, బీటు పుస్తకం, సెంట్రీ రిలీఫ్ పుస్తకం, కెడి చెక్ రిజిస్టరు, ఎఫ్. ఐ. ఆర్. ఇండెక్స్, హిస్టరీ షీట్, టిపి రిజిస్టరు వగైరా వగైరా అన్నింట్లోవుండే ఎంట్రీలన్నీ కంఠోపాఠం. అది సామాన్య విషయం కావచ్చు. ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్టు మొదలైనవి కూడా వెంకటపతికి వేళ్ళమీద వుంటాయి. పేరు మోసిన క్రిమినల్ లాయరు ఏదో సందర్భంలో ఐపిసి సెక్షను మరిచిపోవచ్చునేమో గాని వెంకటపతిని మాత్రం గాఢ నిద్రలోలేపినా ఠకీమని చెప్పేయగలడు.

అంకెలంటే అసలు పోలీసు శాఖకే అభిమానం. కానిస్టేబుళ్ళని తరచు నెంబర్లతో పిలవడం రివాజైపోయింది. వెంకటపతి ఎవరికైనా పనిపురమాయిస్తే రెండు మూడు ఐపిసి సెక్షన్లు బయటికి రావలసిందే. సంగతి అర్థం కాక అవతలి వాళ్ళు తికమకపడక తప్పదు.

పనిష్మెంట్ల ప్రస్తావన వచ్చిందంటే చాలు వెంకటపతి సెక్షన్ల వర్షం కురిపించేవాడు.

దొంగతనం కేసుల్లో లాకప్‌లో పెట్టినవాళ్ళని చితకబాదేటప్పుడు వెంకటపతి ఐపిసి 378 సెక్షన్ పైన వ్యాఖ్యానం చేసేవాడు. ఆ సెక్షను లోతుపాతులు చాలావరకు లాకప్ రూం ఇటుకలన్నింటికి అర్థమైవుంటాయని అందరూ చెప్పుకుంటారు. నడ్డిమీద దెబ్బలతో బాధపడే నిందితులికి మూలిగే నక్కమీద తాటిపండులా ఈ భాష్యాల రొద వెర్రెక్కించేది.

చాలాసార్లు ఎస్ఐ చెప్పేవాడు "వెంకటపతీ! దెబ్బ దెబ్బకీ ఆ సెక్షన్లు చెప్పి వాణ్ని కన్ఫ్యూజ్ చేసేస్తుంటే నిజం ఎలా కక్కుతాడయ్యా! తిట్టడం చేతకాకపోతే చేతులున్నాయిగా, ఆ లాఠీవుందిగా" అని. ఓటమిని అంగీకరించడం వెంకటపతి జాతకంలోనే లేదు. ఇంకో రెండు మూడు సెక్షన్లు కలిపి ఎస్ఐకి సమాధానం చెప్పేవాడు.

అందుకని వెంకటపతి సంఖ్యాగీతం అలపిస్తుంటే ఎవ్వరూ జోక్యం చేసుకునేవారు కాదు.

ఒకసారి వెంకటపతి ఇంటికి బంధువులెవరో వచ్చారు. ఆ సంగతి చెప్పడానికి కొడుకు రత్నం స్టేషను కెళ్ళాడు. అప్పుడు వెంకటపతి వర్ధన కార్యక్రమంలో బిజీగా వున్నాడు. పైగా అది రాబరీ కేసు. అలాంటి సమయంలో కానిస్టేబుళ్ళెవరైనా అటు వెళ్ళేందుకు జంకుతారు. స్వయంగా చెప్పమని కొడుకు రత్నాన్ని పంపించారు. వెంకటపతి నిందితుణ్ని గొడ్డును బాదినట్లు బాదుతూ 390 సెక్షను గురించి పెద్దగా అరుస్తూ చెబుతున్నాడు. రత్నం ఎంత పిలిచినా ఫలితం లేకపోయింది. అతని తల తిరిగిపోయింది. చుట్టాలొచ్చిన సంగతి కానిస్టేబుళ్ళతో చెప్పి ఇంటికెళ్ళిపోయాడు. ఆ సంగతి చెప్పిన కానిస్టేబుల్‌కి ఆ రోజు ఎవిడెన్స్ యాక్ట్ పాఠం చెప్పాడు వెంకటపతి.

వెంకటపతికి స్టేషనుతోనే లోకం. భోజనానికి వెళ్ళి రావడం, రాత్రి నిద్ర సమయం పోను మిగిలిన కాలమంతా స్టేషన్లోనే సరిపోతుంది. ఇంట్లో ఎక్కువ బాదర బందీలేదు కాబట్టి చెల్లుతోంది. ఒక కూతురు, ఇద్దరు కొడుకులు, ఈ మధ్యే ఆడపిల్లకి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపాడు. రత్నం బి ఏ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండో కొడుకు ఇంటర్ ఫైనలియరు.

ఆశలన్నీ రత్నంపైనే నిలుపుకున్నాడు. చదువులో బాగానే పైకి వస్తున్నాడు. లెక్కలంటే అభిరుచి. వీటికి తోడు రత్నం లక్కీ నెంబరు 9. పుట్టిన తేదీ అంకెలన్నీ కలిపితే తొమ్మిదే వస్తుంది. మార్చి 24. అవి

కలిపినా వచ్చేది తొమ్మిదే. వెంకటపతికి 9 మీద అంతులేని నమ్మకం. రత్నానికి కండరపుష్టి, నిశిత దృష్టివున్నాయి. సాహసి. అపజయానికి జంకడు. తేలికగా పోలీసుశాఖలో ఎస్ఐగా ఉద్యోగం సంపాదించడానికి అర్హతలూ, అవకాశాలూ ఉన్నాయి.

అన్నీ వుండబట్టే వెంకటపతి తన కొడుకు రత్నం ఎస్ఐగా పోలీసుశాఖకు సేవ చేసి తన పేరు నిలబెడతాడని కొండంత నమ్మకంతో ఉన్నాడు. ఎప్పుడు బి ఏ ప్యాసౌతాడా, ఎప్పుడు రిక్రూట్‌మెంట్ పరీక్షలో నెగ్గి తన కలలు పండిస్తాడా అని నిరీక్షిస్తున్నాడు.

గట్టి మేలు జరగడం కోసం కెంపువేసిన ఉంగరం చేయించాడు కొడుకు ఫలం చూపించాడు. అన్నీ అనుకూలంగా వున్నట్లు చెప్పారు.

కొడుకు చదువుకు ఎలాంటి ఇబ్బంది రాకుండా జాగ్రత్త తీసుకున్నాడు. ఎప్పటికప్పుడు కావలసిన ఏర్పాట్లు చేస్తున్నాడు కూడా. పరీక్షలు అనుకూలమైన తేదీన ఆరంభమయ్యాయి. అది మంగళవారం. అదీ అనుకూలమైందే.

తీరా పరీక్షా ఫలితాలు వచ్చాక వెంకటపతి నెత్తిన పిడుగుపడినట్టయింది. రత్నం నెంబరు అందులో లేదు. వెంకటపతి రుద్రుడయ్యాడు. కొడుకును నానా విధాలుగా తిట్టాడు. చేయి కూడా చేసుకున్నాడు. ఆ రోజు ఇల్లు నరకంగా తయారయింది. అర్ధరాత్రి వరకు రభస జరుగుతూనే ఉంది. సద్దుమణిగిన తర్వాత కాలే కడుపుల్తోనే అందరూ నడుములు వాల్చారు.

తెల్లవారి లేచిచూస్తే రత్నంలేడు. ఊరూవాడా గాలించారు. బంధువులందర్నీ వాకబు చేశారు. మిత్రులందర్నీ అడిగారు. పేపర్లో వేయించారు. రకరకాల ఆలోచనలు వెంకటపతిని చుట్టుముట్టాయి. మిల్టరీ రిక్రూట్‌మెంట్ సెంటర్లన్నిటిలోనూ అడిగారు. పెద్ద పెద్ద

హోటళ్ళల్లో, కార్ఖానాల్లో భోగట్టా చేయించాడు. లాభంలేకపోయింది. ఆచూకీ దొరకలేదు.

కాలం దొర్లిపోతోంది. వెంకటపతి మారిపోయాడు. కుంగి పోయాడు.

రత్నం ఏ క్షణాన ఏ రూపంలో వస్తాడోనని కళ్ళు కాయలు కాసేటట్లు ఎదురుచూస్తున్నాడు. తాను దిగుల్తో సగమైపోతున్నా పైకి గంభీరంగా వుంటూ భార్యకి ధైర్యం చెబుతున్నాడు.

స్టేషన్లో లారీలకు విశ్రాంతి ఎక్కువైంది. రత్నం ఈడు వాళ్ళెవరు లాకప్‌లోకి వచ్చినా వాళ్ళ వంటిమీద ఈగనైనా వాలనిచ్చే వాడు కాదు. రత్నం పేరుగల వాళ్లెవరు వచ్చినా అన్ని సదుపాయాలు అమిరేవి.

వెంకటపతిలో వచ్చిన మార్పు మొత్తం పోలీసుశాఖకే ఆశ్చ ర్యంగా వుంది. ఇక మామూలు ప్రజల సంగతి వేరే చెప్పనవసరంలేదు.

పశ్చాత్తాపంతో అతని మనసు దహించుకుపోతోంది. వెంకటపతి దైన్యాన్ని చూసి పై అధికార్లు మరింత ఆసక్తి చూపి రత్నం కోసం వెతకని చోటులేదు. అయినా ఫలితంలేకపోయింది. ఎవరికి తోచిన సమాధానం వారు చెప్పుకున్నారు. వెంకటపతి అంతరాత్మకి మాత్రం శాంతిలేకుండా పోయింది. బంగారు కలలు కన్నాడు. అవేవీ ఫలించక పోయినా నష్టమేమీలేదు. కొడుకు పైన తండ్రి అలాంటి ఆశలు పెట్టు కోవడం దోషం కాదు. ఆవేశంలో అన్నమాటకే ఆగ్రహించి ఇంత క్షోభ పెట్టడానికి కొడుకు మనసెలా ఒప్పిందో వెంకటపతి ఊహకు అందలేదు. కనీసం ఒక్కసారైనా తన క్షేమ సమాచారం రాయలేదు. వెంకటపతి నిస్సహాయంగా మూగవేదన అనుభవిస్తున్నాడు.

రత్నం వెళ్ళిపోయి సంవత్సరంన్నర దాటింది. క్రితంసారి రత్నం పుట్టిన రోజున అందరికీ పళ్ళూ మిఠాయిలూ పంచిపెట్టాడు. పేదవాళ్ళకి బట్టలు పెట్టాడు. రత్నం ఫోటో పేపర్లో వేయించి వెంటనే

రావలిసిందిగా దీనాతి దీనంగా అర్థించాడు. కాని ప్రత్యుత్తరం రాలేదు. ఆచూకీ తెలియజేస్తే బహుమానం ఇస్తానని ప్రకటించాడు. అదీ నిష్ప్రయోజనమయింది.

కష్టాలున్నాయని కాలం అగదు.

రత్నం వెళ్ళాక రెండో పుట్టిన రోజు కూడా దగ్గరపడుతుంది. యథాపూర్వంగా జరపడానికి ఏర్పాట్లు ప్రారంభించాడు. మనసులోనే దుఃఖాన్ని దిగమింగుకుని యాంత్రికంగా పనులు చేసుకుపోతున్నాడు. లోటు రానివ్వడంలేదు. రాయిలాంటి గుండె నిండా వెన్న నింపుకున్నాడు. అంతులేనివేదన తగ్గేందుకు పరిష్కారం కనిపించలేదు. అదీ వెంకటపతి స్థితి—

గతాన్ని స్మరించుకున్న వెంకటపతి తెప్పరిల్లి ఉత్తరం వుంచిన జేబు తడిమి చూసుకున్నాడు. భద్రంగా వుంది. ఒక్క క్షణం ఆలోచించాడు. ఒక నిర్ణయానికి వచ్చినట్లు సీట్లో సర్దుకుని కూర్చున్నాడు. ముఖం గంభీరంగా వుంది. విచిత్రంగా వేదనంతా ఆవిరైపోయిన అనుభూతి కలిగింది.

తెల్లకాగితం తీసుకున్నాడు. పెన్‌స్టాండ్ లోంచి కలం తీశాడు. ఫైళ్ళ వంకా, చుట్టూ పరిసరాలవంకా ఆప్యాయంగా చూశాడు. ఇక వాటితో తన బంధాల్ని వదులుకోబోతున్నాడు. వాలంటరీ రిటైర్మెంటుకు మొన్ననే అతనికి అర్హత వచ్చింది.

కుటుంబ పరిస్థితులు కారణంగా తాను ఈ వాలంటరీ రిటైర్మెంట్ కోరుతున్నానని పై అధికార్లకు విన్నవించుకుంటూ తన పదవీ కర్తవ్యాలను వెంటనే వదిలి పెట్టేందుకు అనుమతి అర్థిస్తూ అర్జీ రాయడం పూర్తి చేశాడు.

మళ్ళీ ఒకసారి చదివి సరిచూసుకున్నాడు.

ఎస్‌ఐ రూంలోకి వెళ్ళాడు. కంఠం గద్గదికమైంది. మాట్లాడలేరపోయాడు. అర్జీ అందించి నమస్కారమే సమాధానంగా కూర్చుండి

పోయాడు. భుజంతట్టి సరే అన్నట్లు ఎస్ ఐ తలూపాడు. ఫార్మాలిటీస్ వెంటనే పూర్తి చేయడం ప్రారంభించాడు. ఫారాలు నింపారు. సంతకాలు తీసుకున్నారు.

ఆ రోజు సాయంత్రమే వీడ్కోలు సమావేశం జరిపారు. ఇంత హఠాత్తుగా విడుదల కోరడం ఆశ్చర్యంగావున్నా కొడుకు ఆచూకీ తెలియక వెంకటపతి పడుతున్న మనోవేదన వారికి తెలియందికాదు.

వెంకటపతి నిర్ణయం కుటుంబాన్ని విస్మయపరిచింది. కాని భార్య వివరాలు అడగలేదు. కొడుకుపై బెంగతో ఈ నిర్ణయం తీసుకున్నాడని అనుకుందామె. అదీ మంచిదే అని భావించింది.

వేరే పనిపైన వెళ్తున్నానని రెండు మూడు రోజుల్లో తిరిగివస్తానని ముక్తసరిగా భార్యకు చెప్పి బయలుదేరాడు. భర్తను ఇతర వివరాలు అడిగే ధైర్యం ఆ ఇల్లాలికి లేదు. పైగా చెప్పదగిన సంగతులుంటే ఆయనే చెప్పేవారని మనసు కుదుటపరుచుకుంది.

వెంకటపతి వెంట మరో జత బట్టలు మాత్రం తీసుకున్నాడు ఉత్తరం దగ్గరే ఉంచుకున్నాడు. రైల్వేస్టేషనుకు బయలుదేరాడు. ముఖంలో వేదనలేదు. నిరాశలేదు.

కిటికీ పక్కసీట్లో కూర్చున్నాడు. రైలు బయలుదేరే టైం కావచ్చింది. తానిప్పుడు సర్వస్వతంత్రుడు. మాజీ హెడ్డు. ఉత్తరం బయటికి తీశాడు. అక్షరాలు కుదురుగా వున్నాయి

'నాన్నా! నమస్కారాలు. క్షేమం. పుట్టిన రోజున మిమ్మల్ని చూడాలని వుంది. నల్లని పొగలుకక్కుతున్న వ్యవస్థ నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆవేశంతో ఆవేదనతో వచ్చేశాను. బిఎ ప్యాసయ్యాను. భద్రాచలం దగ్గర రంగపాడు మంగళవారం సంతలో టీకొట్టు యజమానిని 'ధనంజయ' అని అడగండి. నా దగ్గరికి తీసుకొస్తాడు. అన్నీ మాట్లాడుకుందాం.

మీ రత్నం,

ఉత్తరం మడిచి భద్రంగా జేబులో దాచుకున్నాడు. ముఖం కొత్త ఆశతో ప్రకాశవంతమయింది. కొడుక్కి నచ్చచెప్పి తిరిగి తన వెంట తీసుకురాగలననే ఆత్మవిశ్వాసం వెంకటపతిలో ప్రస్ఫుటిస్తోంది. ఇద్దరూ కలిసి వ్యవస్థను సరిదిద్దే మార్గం వెంట పయనం సాగించవచ్చుననే ధైర్యం వుంది.

తథాస్తు అన్నట్లు రైలింజను కూత కూసి సంతోషంతో ముందుకు సాగింది. *

(1991)